# ఆకాశంలో రెండు తారకలు

"చావు ఎలా ఉండాలంటే మనిషిని సమాధి చేస్తున్నపుడు ఆ పార్థివ శరీరాన్ని చూసి కాటికాపరి కళ్ళు చెమర్చాలి!" - ఈ మాటలన్నది ఎవరు ? మార్క్ట్వైనా! ఎవరైతేనేం. ఈ మాటల్ని గోపాలపురం క్రైస్తవ శ్మశాన వాటికలోని కాటికాపరి ఓబులేసు నిజం చేసాడు. నిర్జీవంగా ఉన్న రామానుజం మృత దేహాన్ని చూసి ఓబులేసు గుండె పగిలేలా ఏడ్చాడు. ముప్పై ఏళ్ళుగా అతనిది కాటికాపరి ఉద్యోగం. నిమిత్త మాత్రుడిలా తన పని తాను చేసుకుపోతాడు. ఏ చావు అతడిలో కదలిక కలిగించదు. ఏ ఒక్కరు మృత్యువాత పడినా అతడిలోంచి కంటి చుక్కబైటకు రాదు. మరి రామానుజాన్ని చూసి ఎందుకు ఏడ్చినట్టు?

ఆగష్టు నెల 13వ తారీకు 2010 వ సంవత్సరం, సరిగ్గా ఉదయం ఐదుగంటలకు గోపాలపురం చర్చిలో అర్థాంతరంగా గంటలు మోగాయి సరిగ్గా అరవయ్యేరు. ఆ వయసులో చనిపోయింది ఎవరో? అనే మీ మాంశలో అందరూ ఉండగానే టముకు వినిపించింది. "గోపాలపురం గ్రామ కాపరస్తుడు రామానుజం చనిపోయినందున అతని సంఘస్తులంతా క్రైస్తవ శ్మశాన వాటికకు సరిగ్గా మధ్యాహ్నం పన్నెండు గంటలకల్లా హాజరు కావాలి"

చాటింపు వార్తతో అంతా శ్మశాన వాటికకు చేరుకున్నారు. రామానుజం శవాన్ని చూసి ఏడుస్తున్న ఓబులేశు అందరికీ ప్రశ్నార్థకంగా మిగిలాడు. అతని ఏడుపు వారందరినీ కదిలించింది. కడసారి చూడడానికి వచ్చిన హితులు, బంధువులు, అందరి కళ్ళూ చెమర్చాయి. కొందరు బలవంతంగా ఏడుపు ఆపుకున్నారు. శ్మశాన వాటిక పరిసరాలు, చెట్లు, ఇళ్ళు, పంటచేలు సమస్తం శోకసముద్రంలో మునిగినట్టయ్యాయి. ఇంతలో ఆకాశమూ వర్షించింది. శోకాన్ని ఆపుకోలేక చిన్న చిన్న చినుకలతో వర్షం. క్రమేపీ కుంభవృష్టి. అయినా అక్కడ నుండి ఎవరూ కదలలేదు, రామానుజం కర్మకాండ పూర్తయ్యేవరకూ.

శిశువు పుట్టినపుడు ఏడుస్తాడు. తల్లితండ్రులు, బంధువులు ఆనంద పడతారు. మరిపోయినపుడు? అందరూ దుఃఖించి పోయిన వ్యక్తి ఆనంద పడాలి, బహుశా రామానుజం ఆత్మ ఆనందపడు తుందేమో! తన కోరిక నెరవేరినందుకు. మరణం తర్వాత తన ప్రాణమిత్రుడిని విడిచిపెట్టనందుకు!

ఆ సమయంలో అక్కడున్న వృద్ధులు, రామానుజం వయసు వాళ్ళు, ఒక్కసారి గతంలోకి వెళ్ళారు. దాదాపు అరవయ్యేళ్ళు వెనక్కి.

అరవైయ్యేళ్ళ క్రితం గోపాలపురం ఊళ్ళోకి బస్సులొచ్చేవికాదు. ఆ ఊరికి రోడ్డులేదు. చుట్టూ పంట పొలాలు. మధ్యలో ఐదొందల ఇళ్ళున్న ఊరు. మళ్ళీ ఆ ఊళ్ళో ఐదు వీధులు. అగ్రహారం, రాజులవీధి, షావుకార్ల కూడలి, గొల్లపేట, ఆ తర్వాత దళితవాడ పిల్లలు చుదువుకోవాలంటే నడుచు కుంటూ ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న రామాపురం వెళ్ళాలి.

ఆరోజు కొత్తగా బళ్ళు తెరిచారు. అప్పట్లో ఎల్.కెజీలు, యూకేజీలు లేవు. ఏకంగా ఒకటో క్లాసులోకే ప్రవేశం. అగ్రహారం నుంచి ఆరేళ్ళ రామానుజం తలనిండా నూనె రాసుకుని ఉతికిన బట్టలేసుకుని నుదుటి మీద అరకాసంత బొట్టుతో భుజాన పుస్తకాల సంచితో స్కూల్లో చేరడానికి బయలుదేరాడు. అదే సమయంలో దళిత వాడనుంచి అంతే వయసున్న అబ్రహామ్ అతడికి ఎదురుపడ్డాడు. అబ్రహామ్ జుట్టుకి తైలసంస్కారం లేదు. చిరిగిన చొక్కా, జారిపోతున్న నిక్కరు, చంకలో పలక, ఆ తాటాకుల స్కూలు దగ్గర ఆ ఇద్దరూ అప్పుడు! 'ఒరే, ఒరే' అనుకుంటూ రెండు చేతులూ పట్టుకుని స్కూల్లోకి ప్రవేశించారు.

ఒకటో తరగతి గది. పక్కపక్కనే కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న ఆ ఇద్దర్నీ చూసిన మేష్టారి ముఖంలో ఏదో మార్పు. అబ్రహామ్ వైపు చూసి "ఒరేయ్ ఎక్కడ నుంచొచ్చావురా?" అన్నాడు.

"మాది దళితవాడ అండీ!" అన్నాడు అబ్రహామ్ వినయంగా.

"మరి వాడిపక్కన కూర్చున్నావేమిరా?" అంటూ ఆయన కోప్పడ్డారు.

ఆయన మాటలకు దూరంగా జరిగిన అబ్రహాంకు మరింత దగ్గరగా జరిగేడు రామానుజం.

"ఒరేయ్! బుద్ధిలేదురా?" అంటూ బెత్తం చూపించారాయన, రామానుజం వైపు.

రామానుజానికి కోపం వచ్చింది. అయినా, విధిలేక దూరంగా జరిగాడు. తన మిత్రుడిని వేరుగా కూర్చోబెట్టినందుకు రామానుజానికి ఆ చిన్నతనంలోనే ఆ మేష్టారంటే అసహ్యం వేసింది. క్లాసు మొదలయ్యింది. టీచరు చెప్పాడు "ఒరేయ్ అందరూ రోజూ శుభ్రంగా తలకు నూనె రాసుకు రావాలి. ముఖ్యంగా నువ్వు," అంటు అబ్రహామ్ వైపు చూసి, "నీ జుట్టు పిచ్చిక గూడులా ఉందిరా, నూనె రాసుకుని, చక్కగా తలదువ్వుకుని రాకపోతే స్కూల్లోకి రానివ్వను." అన్నాడాయన. స్కూలయిపోయింది. ఇద్దరూ బైట కొచ్చారు.

"ఒరేయ్ రేపు నూనెరాసుకురా!" అన్నాడు రామానుజం.

"నీ కెవరు రాస్తారురా?" అన్నాడు అబ్రహామ్.

"మా అమ్మ" అన్నాడు రామానుజం.

"నాకు అమ్మలేదుగా" అంటూ దిగులుగా చెప్పాడు అబ్రహామ్.

"పాపం! ఏమయ్యిందిరా మీ అమ్మ?" అన్నాడు రామానుజం.

"నేను పుట్టగానే చనిపోయిందట, అందుకే నాన్నకు నేనంటే కోపం. నన్ను పొలం పనిలో పెదరామనుకున్నాడు. నేను చదువుకుంటానని ఏడిస్తే పంపించాడు." అన్నాడు అబ్రహామ్.

"చదువుకోరా, నీకేం, మొదటిరోజే అ, ఆలు గుణింతాలు చకచకా రాసేసావుగా" అన్నాడు రామానుజం హుషారుగా.

"మరి రేపు నూనె రాసుకురావటం ఎలా రా?" అన్నాడు అబ్రహమ్ మరింత దిగులుపడుతూ.

రామానుజం క్షణం సేపు ఆలోచనలో పడ్డాడు. "సరే నేను పట్టు కొస్తానులే" అన్నాడు. ఊళ్ళోకి వచ్చిన తర్వాత ఆ ఇద్దరి దారులూ వేరయ్యాయి. రామానుజం అగ్రహారం వైపు అడుగులు వేస్తే, అబ్రహామ్ దళితవాడ వైపు పరుగెట్టాడు.

తరువాతి రోజు జిడ్డు కారుతూ రామానుజం స్కూల్లో ప్రత్యక్ష మయ్యాడు. అబ్రహామ్ జుట్టుకు సరిపడా నూనె రాసుకొచ్చాడు. రోజూ ఇదే తంతు! స్కూల్లో ఇద్దరినీ వేరేగా కూర్చోబెట్టినా ఒకే ఆత్మ, దేహంగా బతికారు.

రోజులు గడిచాయి, నెలలయ్యాయి. అబ్రహామ్ చదువులో చురుకుగా ఉండేవాడు. రామానుజం తండ్రి పౌరహిత్యం చేసేవాడు. తండ్రికి సాయంగా పెళ్ళిళ్ళకూ, ఇతర వేడుకులకు హాజరవ్వడంతో అతడికి చది వేందుకు తీరిక ఉండేది కాదు. అబ్రహామ్ తను చదివింది అతడికి అప్పచెప్పేసేవాడు. రామానుజం రోజూ అతడికి గుళ్ళోనుంచి పురహార ప్రసాదం తెచ్చేవాడు. అబ్రహామ్ పొలం నుంచి ఏరుకొచ్చిన వేరుశనక్కాయలు, తేగలు రామాను జానికి ఇచ్చేవాడు.

ఒకరోజు మాస్టారు ఏదో పాఠం రాసుకురమ్మన్నారు. తండ్రితో ఎవరిదో పెళ్ళికి వెళ్ళిన రామానుజం ఆ పాఠం రాసుకురాలేదు.

రామానుజాన్ని మాస్టారు బెత్తంతో గట్టిగా కొట్టారు. అబ్రహామూ తనని కొట్టమని చెయ్యి అందించాడు. మాస్టారు బెత్తంతో అతడినీ గట్టిగా కొట్టారు. ఆ తర్వాత అబ్రహాం పుస్తకం చూసిన మాస్టారి ముఖంలో ఆశ్చర్యం.

"ఏరా రాయలేదని చెప్పి అనవసరంగా దెబ్బలు తిన్నావ్?! చక్కగా రాసావుకదా!" అంటూ అతడివంక జాలిగా చూసాడు.

స్నేహితుడితో పాటు తానూ దెబ్బలు తినాలి. అదే తను చెయ్యాల్సింది అనుకున్న అబ్రహాం అంతరంగం మాష్టారుకు అర్థమయింది. స్నేహితు లిద్దరినీ వేరువేరుగా కూర్చోబెట్టినందుకు బాధపడ్డారు. ఆ రోజునుంచీ ఇద్దరినీ పక్క పక్కనే కూర్చోబెట్టారు.

ఐదో తరగతి అయిన తర్వాత ఇద్దరూ తమ ఊరికి దగ్గరలోని టౌనులో హైస్కూల్లో జాయినయ్యారు. రామానుజం తండ్రి అతడు స్కూల్ ఫైనల్‌లో ప్రవేశించిన రెండు నెలలకే గుండెనొప్పి వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్ళక మునుపే చనిపోయారు. అంతే చదువుకు స్వస్తి చెప్పాడు. తనమీద ఆధారపడిన ఇద్దరు చెల్లెళ్ళు, తమ్ముళ్ళకోసం అతడు తండ్రి నుంచి సంక్ర మించిన పౌరోహిత్యం వృత్తిగా స్వీకరించాడు. మిత్రుడు, చదువు మాని నందుకు అబ్రహామ్ బాధపడ్డాడు.

రామానుజం నవ్వుతూ, "నీకన్నా నాకు ముందే ఉద్యోగం వచ్చిందిరా.. అయినా నీ చుదువుకు ఆటంకం రానివ్వకు, డబ్బులు అవసరమైతే సర్దేందుకు నేనున్నాను కదా!" అన్నాడు.

అబ్రహామ్ స్కూల్ ఫైనల్ పరీక్ష ఫస్ట్ క్లాసులో పాసయ్యాడు.

ఆ తర్వాత పి.యు.సి.లో చేరాడు. అది పాసయిన తర్వాత యూనివర్సిటీలో బియ్యే ఆనర్స్‌లో సీటు రావడంతో వైజాగు వెళ్ళిపోయాడు.

అబ్రహామ్ ఆ ఊరు విడిచిపెట్టినా తరచుగా ఇద్దరిమధ్యా ఉత్తరాలు నడిచేవి. రామానుజం అప్పుడపుడు తనకున్నదాంట్లోనే కొంత డబ్బు అబ్రహాం చదువు నిమిత్తం పంపేవాడు.

బియ్యే ఆనర్స్ ఫస్ట్‌క్లాసులో పాసయిన అబ్రహామ్‌కు వైజాగ్‌లోనే లెక్చరర్‌గా ఉద్యోగం విచ్చింది. ఉద్యోగం చేస్తూనే సివిల్ సర్వీసు పరీక్షలకు తయారయ్యాడు. రామానుజం పౌరోహిత్యంలోనే స్థిరపడిపోయాడు - అబ్రహామ్ సివిల్ సర్వీసు పరీక్ష రాసే రోజున రామానుజం అతడి పేరున ఆలయంలో అర్చన చేయించాడు.

అబ్రహామ్ సివిల్ సర్వీసు పరీక్షల్లో విజేతగా నిలబడ్డాడు. రామానుజం ఆనందానికి అవధులు లేవు. గుడిలో మెట్టుకో కొబ్బరికాయకొట్టాడు. ఊళ్ళో అందరికీ ప్రసాదం పంచాడు.

అబ్రహామ్‌కు మధ్యప్రదేశ్ కేడర్‌లో ఐఏఎస్ అధికారిగా పోస్టింగ్ వచ్చింది.

అబ్రహామ్ ఐఏయస్ అయినా, రామానుజం పురోహితుడైనా ఇద్దరి స్నేహంలో మార్పులేదు. సెలవులకు అబ్రహామ్ ఆ ఊరు వచ్చేసేవాడు. ఇద్దరూ రామానుజానికున్న టూవీలర్ మీద తిరిగేవారు. గోదారొడ్డున కూర్చుని గంటలతరబడి కబుర్లు చెప్పుకునేవారు. మధ్య మధ్యలో అబ్రహాం పాత హిందీ పాటలు పాడితే, రామానుజం హరిశ్చంద్ర నాటకంలో పద్యాలు అందుకునేవాడు.

ఆ జిల్లాకు చెందిన ఒక తాసిల్దారుగారి అమ్మాయితో అబ్రహామ్‌కు పెళ్ళి కుదిరింది. పెళ్ళి చూపులకు రామానుజాన్ని తోడుగా తీసుకువెళ్ళాడు. అబ్రహాం కోసం పంచెకట్టు మాని పేంటు వేసుకున్నాడు రామానుజం. అబ్రహామ్ పెళ్ళి తన ఇంట్లో వేడుకలా తనే స్వయంగా పెళ్ళి ఏర్పాట్లు చేసాడు రామానజం.

పెళ్ళయిన తరువాత అబ్రహామ్, తన భార్య ఏంజిలీనాతో తనకు పోస్టింగ్ వచ్చిన రాయపూర్ వెళ్ళిపోయాడు.

చెల్లెళ్ళ పెళ్ళి, తమ్ముళ్ళ చదువుతో రామానుజం తన పెళ్ళి సంగతి మరచిపోయాడు. అబ్రహామ్ చాలాసార్లు ఆ విషయం కదిపినా "ఆ ఊసెత్త వద్దు" అనేవాడు. అలా రామానుజం బ్రహ్మచారిగా మిగిలిపోయాడు.

చాలా వసంతాలు గడిచాయి. అబ్రహామ్ మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో వివిధ హోదాలలో పనిచేసి పదవీ విరమణ నాటికి ప్రత్యేక కార్యదర్శి

అయ్యాడు. అతడి పిల్లలంతా పెళ్ళిళ్ళయి అమెరికాలో స్థిరపడ్డారు. అబ్రహాం రిటైరైన తరువాత కూడా చాలా అవకాశాలొచ్చాయి. అయినా భార్యతో తన స్వగ్రామమైన గోపాలపురం వచ్చేసాడు, తన అరవై ఒకటో సంవత్సరం వయసులో -

ఇక మిత్రుల ఆనందానికి అవధులు లేవు. మార్నింగ్ వాక్‌తో ప్రారంభమై రాత్రి పడుకోబోయే వరకూ ఒకరిని ఒకరు విడిచి ఉండేవారుకాదు. అబ్రహామ్ భార్య ఏంజిలీనా సరదాగా అనేది, "ఆ రామానుజాన్ని కట్టుకో పోయారా, పైగా బ్రహ్మచారి"! అని

రిటైరయిన సంవత్సరం తర్వాత అబ్రహామ్ భార్యతో అమెరికా వెళ్ళాడు పిల్లల దగ్గరకని. ఆ రెండు నెలలు, రామానుజానికి పిచ్చెక్కి నట్టయింది. రోజూ రాత్రి ఫోను చేసేవాడు. తర్వాతి సంవత్సరం రామానుజాన్ని తమతో పాటు అమెరికా తీసుకువెళ్ళాడు అబ్రహామ్. అబ్రహామ్ పిల్లలు, రామానుజానికి అమెరికాలోని ముఖ్యప్రదేశాలన్నీ చూపించారు. నెలరోజుల తర్వాత వచ్చేసాడు రామానుజం వాళ్ళతో కలిసి.

అబ్రహాం అరవై అయిదవ పుట్టినరోజునాడు దేవాలయంలో అతడి పేర అర్చన చేయించాడు రామానుజం. ఇద్దరూ కలిసి అబ్రహామ్ కారులో ఊరంతా తిరిగారు. అబ్రహామ్ ఇంట్లోనే రామానుజానికి భోజనం. అబ్రహాం భార్య ఏంజిలీనా అతడికి కొసరి కొసరి వడ్డించింది. ఆ రోజు చాలా రాత్రివరకూ ఇద్దరూ మాట్లాడుకున్నారు. అలా మాట్లాడుకుంటూనే రామానుజం అబ్రహామ్ ఇంట్లోనే నిద్రపోయాడు - ఉదయం ఏంజిలీనా మిత్రులిద్దరికీ టీ తీసుకు వచ్చింది. అబ్రహామ్ కన్నా ముందే లేచిన రామానుజం ఇంటికి బయలు దేరుతున్నాడు.

అయితే, ఏంజిలినా ఎంత సేపు లేపినా అబ్రహామ్ లేవలేదు. వెంటనే రామానుజం డాకర్‌రు దగ్గరకు పరిగెత్తాడు. డాక్టరొచ్చి చెప్పాడు, నిద్దట్లోనే

చనిపోయాడని, రామానుజం ఏడ్చిన ఏడ్పులు ఊరంతా ప్రతిధ్వనించాయి. అమెరికా నుంచి అబ్రహామ్ పిల్లలొచ్చిన తర్వాత ఆ ఊళ్ళోని క్రైస్తవ శ్మశాన వాటికలో అబ్రహామ్ శరీరాన్ని ఖననం చేసారు నెలరోజుల తర్వాత, ఏంజిలీనాను తీసుకుని అబ్రహామ్ పిల్లలు అమెరికా వెళ్ళిపోయారు.

రామానుజం పౌరోహిత్యం మానేశాడు. వారాల తరబడి గెడ్డం గీసుకోకుండా గడిపేవాడు. చెల్లెళ్ళు వచ్చి కళ్ళనీళ్ళు పెట్టుకునేవారు. తమ్ముళ్ళు తమ ఇంటికి రమ్మని బ్రతిమాలేవారు. ఎవరేం చెప్పినా నిర్వికారంగా ఉండేవాడు. రోజూ అబ్రహామ్ సమాధి దగ్గరకు వెళ్ళి కూర్చునేవాడు.

ఒకరోజు ఉన్నట్టుండి అగ్రహారంలో కలకలం చెలరేగింది. అంతా నివ్వెరపోయారు. రామానుజానికి పిచ్చిపట్టింది అనుకున్నారు. అసలు ఏం జరిగిందంటే? అబ్రహామ్ చనిపోయిన రెండునెలల తర్వాత సమాధుల పండగ. క్రైస్తవ శ్మశాన వాటిక ఆ రోజు రాత్రంతా కొవ్వొత్తుల వెలుగుతో నిండిపోయింది. ఏంజిలీనా, పిల్లల్ని తీసుకుని అమెరికా నుంచి వచ్చింది. అబ్రహామ్ సమాధి మీద పుష్పగుచ్ఛాలు, పూలదండలు పరిచారు. కొవ్వొత్తులు వెలిగించారు.

అర్ధరాత్రి నుంచి ప్రొద్దు పొడిచేవరకూ రామానుజం, అబ్రహామ్ సమాధి దగ్గరే ఉండిపోయాడు. ఆ శ్మశానవాటిక కాటికాపరి ఓబులేశు అప్పుడే పరిచయమయ్యాడు. ఓబులేశును ఆ ఉదయమే అడిగాడు తనలో మెదిలే ప్రశ్నను-దానికి అతగాడు ముందు ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత రామానుజాన్ని అదోలా చూసాడు. అయినా, రామానుజం మళ్ళీ మళ్ళీ అడిగాడు.

"ఎలా కుదురుతుంది పంతులుగారూ? "అబ్రహామ్ సార్ క్రిష్టియన్, మీరు పంతులు గారు!" అన్నాడు ఓబులేశు.

"వేరే మార్గం లేదా?" అన్నాడు రామానుజం, అతడితో ప్రాధేయ పూర్వకంగా.

“అలా చేస్తే కుదురుతుందేమో!” అన్నాడు ఓబులేశు.

అలా చక్రావధానుల రామానుజం అనే గోపాలపురం వాస్తవ్యుడు ఆ ఊళ్ళోని చర్చిలో ఫాదర్ గారి చేతుల మీదుగా క్రైస్తవ మతం పుచ్చుకున్నాడు.

తెల్లవారక ముందే లేచి అష్టోత్తరం చదువుకుని, గోదాట్లో మూడు మునకలు వేసి గుళ్ళోకి వచ్చి నుదుటి మీద నామాలు దిద్దుకుని, నిష్టగా, భక్తిగా తన వృత్తిధర్మం నిర్వర్తించే రామానుజం క్రైస్తవుడయ్యాడు, కేవలం తన ప్రాణమిత్రుడికోసం! అతడి పక్కనే శ్మశానంలో తనూ చోటు సంపాదించుకుందామని.

అగ్రహారంలో రామానుజం గోత్రీకులంతా పెదవి విరిచారు. ఇతగాడికి ఇదేం పిచ్చి అనుకున్నారంతా!

వారానికోసారి శ్మశాన వాటికకు వెళ్ళి, “నా కోరిక తీరుతుంది కదా!” అనేవాడు.

“ఇబ్బంది లేదు. మీరు మతం పుచ్చుకున్నారు కదా బాబు..” అని ఓబులేశు చెప్పేసరికి సంతృప్తిగా వెనుతిరిగేవాడు రామానుజం, రోజులు, వారాలు, నెలలూ, సంవత్సరాలు గడిచాయి.

మూడేళ్ళ తర్వాత ఒకరోజు, ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. రామానుజం గుండెల్లో ఏదో అలజడి. అలసటగా అనిపించింది. ఊపిరి పీల్చుకోలేకపోయాడు. పక్కింట్లో వాళ్ళని నిద్రలేపాడు. తమ్ముళ్ళు, చెల్లెళ్ళు రాకమునుపే అతడిని ఆసుపత్రికి తీసుకెళ్ళారు. పరీక్ష చేసిన డాక్టర్లు ఐ.సి.యూలో ఉంచారు. గంట తర్వాత తమ్ముళ్ళు, చెల్లెళ్ళు వచ్చారు.

“నా పని అయిపోయింది, నా ఆఖరి కోర్కె తీర్చండి.” అన్నాడు.

“కంగారుపడకు, సమయానికి ఆసుపత్రికి చేర్చారు కదా ఫరవాలేదు,

తగ్గిపోతుంది.'' అన్నారందరూ. అయితే ఆ సాయంత్రమే మరోసారి స్ట్రోక్ వచ్చి, రామానుజం తనువు చాలించాడు.

శ్మశానవాటికలో రామానుజం నిర్జీవ దేహాన్ని చూసిన కాటికాపరి ఓబులేశు ఒక్కసారిగా ఏడ్చాడు. నా మిత్రుడి పక్కనే నన్ను పడుకోబెడతావ్ కదా అని రామానుజం చెవిలో గుసగుసగా చెప్పినట్టనిపించి అతను మరింత ఏడ్చాడు. స్నేహంలో ఇంత గొప్పదనం ఉందా అనుకున్నాడతడు. కర్మకాండ పూర్తయి అందరూ వెళ్ళిపోయినా కాటికాపరి ఓబులేశు హృదయం మూగగా రోదిస్తూనే ఉంది.

ఆ రోజు రాత్రి చంద్రుడు మరింత శోభాయమానంగా కనిపించాడు. ఆకాశం మరింత తేటగా కనిపించింది. మరువలేని స్నేహచరితకు గుర్తుగా నిలిచిన ఆ మిత్రుల దేహాలు పక్కపక్కనే సమాధిచేయబడినాయి. వారి సమాధి స్థలంపైన, ఆకాశంలో జాబిల్లి పక్కన రెండు నక్షత్రాలు. ఒకరి గుండె గదిలో మరొకరు కొలువైవున్న ఆ స్నేహితులు ఆకాశంలో తారలు కావడంలో ఆశ్చర్యం ఏం ఉంది?

(రచన కౌముది 2011 కథల పోటీలో ప్రత్యేక బహుమతి.
సెప్టెంబర్ 2011 కథా కౌముదిలో ప్రచురణ)